# కథావేదిక

మంచి కథల్ని మళ్ళీ మళ్ళీ చదువుకోవడం కోసం కథలన్నింటినీ ఒకే గుత్తిగా అందిస్తున్నాం

## అతడొచ్చాడు

-ఎన్.శివనాగేశ్వరరావు


**బె**డ్రూమ్‌లోని సెల్‌ఫోన్ మ్రోగింది. కిచెన్‌లో కాఫీ కలుపుతున్న శ్రావ్య గుండె దడదడలాడింది. ఎవరై ఉంటారు? అతను కాదుకదా? అనుకుంది. స్టవ్ ఆఫ్ చేసి బెడ్రూమ్‌వైపు నడిచింది. సెల్ చేతిలోకి తీసుకుని నెంబర్ చూసింది. అతని దగ్గరనుంచే ఫోన్‌కాల్. మాట్లాడాలా? వద్దా? అని ఆలోచిస్తూ ఉండగా కాల్ కట్ అయింది.

'హమ్మయ్య' అని నిట్టూర్చింది శ్రావ్య. మరుక్షణం తను ఫోన్ చేస్తే ఎలా ఉంటుందా? అని ఆలోచించింది. కానీ ధైర్యం చేయలేకపోయింది. 'ఈసారి ఫోన్‌కాల్ వస్తే మాట్లాడుదాం' అనుకుంది.

సెల్‌ఫోన్ తీసుకుని కిచెన్‌లోకి వెళ్లింది. కాఫీ త్రాగుతూ ఆలోచించింది. 'అతనెందుకు ఫోన్ చేసి ఉంటాడు? ఫోన్‌లో కిస్‌లు ఇవ్వడానికా?' అనుకుంది. మరుక్షణం అతని గురించి ఎందుకు చెడుగా ఆలోచించాలి? మంచిగా చేసాడేమో అనుకుంది.

అతని దగ్గరనుంచి మరలా ఫోన్ వస్తే బావుణ్ణు అనుకుంటూ ఉండగా మరలా ఫోన్ రింగయింది. చూస్తే అతని దగ్గరనుంచే.

మరలా శ్రావ్య సందేహంలో పడింది. మాట్లాడాలా? వద్దా? అని. మనసులో మాట్లాడాలని ఉంది. అయినా బిడియం. ధైర్యం చేసి బటన్ ప్రెస్ చేసి "హలో" అంది.



"హలో నేను.." అటునుంచి అతని స్వరం వినిపించింది.

"చెప్పండి" అంది.

"మీతో కొంచెం మాట్లాడాలి. ఓ అరగంటలో మీ ఇంటికి వస్తాను" అన్నాడతను.

"వద్దు...రావద్దు" కంగారుపడింది శ్రావ్య.

ఆమె కంగారును అతను పసిగట్టాడు.


"ఎందుకని రావద్దు" ప్రశ్నించాడు.

"ఇంట్లో మమ్మీ డాడీ లేరు" విషయం చెప్పింది శ్రావ్య.

"నేను వస్తున్నది మీతో మాట్లాడడానికి. అటువంటప్పుడు వాళ్లు లేక పోతేనేం?" అన్నాడు అతను.


"ఆడపిల్ల ఒంటరిగా ఉన్నప్పుడు వస్తే ఎవ్వరైనా ఏమైనా అనుకుంటారు" మనసులోని మాట చెప్పింది.

"నేను ఎవరినీ లెక్క చేయను. మీమీద మీకు నమ్మకం ఉందా?"



## మరో కలెక్టర్

'కలెక్టర్ జానకి', 'కలెక్టర్‌గారి కొడుకు' లాంటి కలెక్టర్ టైటిల్‌తో సినిమాలు వచ్చాయి. చాలా కాలానికి మళ్లీ ఈ కలెక్టర్ టైటిల్ వస్తోంది. భూమిక హీరోయిన్‌గా నటిస్తున్న కొత్త సినిమాకి 'కలెక్టర్‌గారి భార్య' అనే పేరు పెట్టారట. అఫ్‌కోర్స్, ఈ సినిమా ప్రారంభమై కొన్ని నెలలవుతున్నా ఇంతదాకా పూర్తికాలేదు. కలెక్టర్‌గా ప్రకాష్ రాజ్ నటిస్తున్నాడు. ఇన్నాళ్లకి టైటిల్‌ని కన్‌ఫర్మ్ చేసుకున్న ఈ సినిమా ద్వారా భూమికకి ఎలాంటి పేరొస్తుందో చూడాలంటే కొన్ని రోజులాగాలి మరి!




అడిగాడతను.

"ఉంది" మెల్లగా చెప్పింది శ్రావ్య.

"నామీద నాకు నమ్మకం ఉంది. మీ మీద మీకు నమ్మకం ఉంది. ఇంక ఎవరు ఏం అనుకుంటే మనకేంటి? నిజాయితీగా ఆలోచించండి" కన్విన్సింగ్‌గా మాట్లాడాడు అతను.

"అయితే మీ ఇష్టం" గొణిగింది శ్రావ్య.

"విథిన్ హాఫ్ ఏన్ అవర్ ఐ విల్ బి దేర్" చెప్పాడతను.

"ఓకే" అంది శ్రావ్య.

ఇప్పుడా అమ్మాయి మనసంతా గందరగోళంగా ఉంది. అమ్మా నాన్నా లేనప్పుడు వస్తున్నాడు. ఎలా బిహేవ్ చేస్తాడో? వద్దని గట్టిగా చెబుదామంటే మమ్మీ డాడీ కోప్పడతారేమోనని ఒకవైపు భయం. రమ్మని చెప్పేసింది. వచ్చాక అతని ప్రవర్తన బాగుండకపోతే ఏం చేయాలి? అన్న టెన్షన్ ఒకవైపు. శ్రావ్య హృదయం అడకత్తెరలో పోకచెక్కలా నలిగిపోయింది. అతను నెలరోజుల క్రితం తల్లిదండ్రులతో కలిసి పెళ్లి చూపులకు శ్రావ్య వాళ్లింటికి వచ్చాడు. పెళ్లి చూపుల కార్యక్రమం ముగిసింది. అతనికి, అతని తల్లిదండ్రులకి శ్రావ్య బాగా నచ్చింది. శ్రావ్య తండ్రి తను ఇవ్వగల కట్న కానుకల విషయం కూడా మాట్లాడాడు. అది కూడా ఓకే అయింది.అయితే తాము ఓకే చెప్పినా ఆడపిల్లల తండ్రి నుంచి గ్రీన్ సిగ్నల్ రాకపోవడంతో అతను, అతని తల్లిదండ్రులు డైలమాలో పడ్డారు. ఎందుకని వాళ్లు తాత్సారం చేస్తున్నారో బోధపడలేదు. అందుకే ఒకసారి అతన పర్సనల్‌గా శ్రావ్య తండ్రి రామచంద్రరావును ఆఫీసులో కలిసాడు. అతను తన దగ్గరకు వచ్చినందుకు రామచంద్రరావు బాధపడ్డాడు.

"సారీ బాబూ... నేనే వచ్చి కలవాల్సింది. మీకు ఏం సమాధానం చెప్పాలో తెలీక రాలేదు" అన్నాడు.

"ఫర్వాలేదు. విషయం చెప్పండి" సూటిగా అడిగాడతను.

"మీ సంబంధం మాకు అన్ని విధాలా నచ్చింది. అయితే అమ్మాయి నుంచే సరైన సమాధానం రావడంలేదు. కొన్నిసార్లు ఇంకా చదువుతాను అంటుంది. మరి కొన్నిసార్లు పెళ్లికి ఇంకా కొంతకాలం ఆగుదాం అని అంటున్నది. తన మనసులో ఏముందో బోధపడడంలేదు. తనను కాదని మొండిగా పెళ్లి కుదర్చడం నా అభిమతం కాదు. నా ఆలోచన ఏమంటే ఈమధ్య అమ్మాయి ఫ్రెండ్స్ కొందరికి పెళ్లిళ్లు అయ్యాయి. వాళ్లు కొన్ని సమస్యలు ఎదుర్కొంటున్నట్లు విన్నాను. అందుకని అమ్మాయి పెళ్లిపట్ల విముఖత కనబరుస్తున్నదని నా అనుమానం.

అక్కడికీ వాళ్ల మమ్మీ అందరూ మగాళ్లు ఒక్కలా ఉండరనీ, మంచి వాళ్లు కూడా ఉంటారని చెప్పి చూసింది. అప్పుడు శ్రావ్య 'నన్ను చూడడానికి వచ్చినతను మంచివాడని గ్యారంటీ ఏమిటి?' అని అడిగిందిట. దానినిబట్టి అమ్మాయి మనసులో పెళ్లిపట్ల భయాలున్నాయని అర్థం చేసుకున్నాను. అందుకే కొంత కాలం ఆగాలనుకుంటున్నాను" తన అభిప్రాయం చెప్పాడు రామచంద్రరావు.

ఆయన మాటలనుబట్టి అతను శ్రావ్యను సంపూర్ణంగా అర్థం చేసుకున్నాడు. ఆ అమ్మాయిని కలిసి మాట్లాడాలనుకున్నాడు. అందుకే వస్తున్నట్లు ఫోన్ చేసాడు. అతను అరగంటలో వస్తానని చెప్పాడు కాబట్టి శ్రావ్య హడావుడిగా స్నానం చేసింది. తనకిష్టమైన పింక్ కలర్ శారీ కట్టుకుంది. అద్దం ముందు నిలబడితే అందమైన రూపం 'హాయ్' అని పలకరించింది. అద్దం ముందు నిలబడి శ్రావ్య కొద్దిపాటి అలంకరణ చేసుకుంది. ఆపాటి అలంకరణకే ఆ అమ్మాయి పుత్తడిబొమ్మలా మెరిసిపోసాగింది.

ఇంత అందమైన రూపాన్ని అందునా ఏకాంతంగా చూస్తే అతను పిచ్చివాడైపోడా? మీదపడి అల్లరి చేయడుకదా? అని భయపడింది. అంతలోనే 'పాపం అలాంటివాడు కాదేమోనని' సరిపెట్టుకుంది.

అతని కోసం కాఫీ కలిపి ఫ్లాస్క్‌లో పోసి ఉంచింది. వాల్‌క్లాక్‌ని చూసి అతను రావడానికి మరో పది నిముషాలు పడుతుంది అనుకుంది.

శ్రావ్యకు తన ఫ్రెండ్స్ అనూష, రాధిక, అనుపమలు గుర్తుకువచ్చారు. వాళ్లకి ఈ మధ్యనే పెళ్లిళ్లు అయ్యాయి. ఒక్కరూ సుఖంగా ఉన్నట్లు చెప్పలేదు. అనూష భర్త సిగరెట్ కాల్చి భార్య తొడలమీద వాతలు పెడతాడట. ఎంత అమానుషం? రాధిక భర్త తాగి వచ్చి భార్యను విచక్షణారహితంగా కొడతాడుట. ఎంత దారుణం? ఇక అనుపమ భర్త ఎందరో అమ్మాయిలతో సంబంధాలు ఉన్నాయిట. పెళ్లి తరువాత కూడా అతను వాటిని కొనసాగిస్తున్నాడట. ఎంత హేయం? అవన్నీ గుర్తుకువచ్చి శ్రావ్య మనసు కకావికలం అయింది.

ఇప్పుడు తను అతనితో పెళ్లికి ఒప్పుకుంటే పెళ్లి తరువాత అతను అందరిలా అమానుషంగా ప్రవర్తిస్తే ఏం చేయాలి? అంతకంటే పెళ్లి చేసుకోకుండా ఉండడం నయంకదూ అనుకుంది శ్రావ్య.

ఇంతకుముందు వచ్చిన సంబంధాలను అబ్బాయిలు బాగుండలేదని, మంచి ఉద్యోగం కాదని తిరస్కరించింది. కానీ ఇప్పుడలా తిప్పి కొట్టడానికి ఆస్కారం లేకుండాపోయింది. అబ్బాయి అందగాడు, మంచి ఉద్యోగం. వీటిని మించి మంచి ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్. అందుకే శ్రావ్య తల్లిదండ్రులతో ఈ సంబంధం వద్దని గట్టిగా చెప్పలేకపోతున్నది. అలాగని మనస్ఫూర్తిగా ఒప్పుకోలేకపోతోంది. ఏం చేయాలో పాలుపోవడంలేదు. శ్రావ్య ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ బయట కాలింగ్ బెల్ మ్రోగింది. 'సరిగ్గా ఇతనొచ్చే సమయానికే మమ్మీ, డాడీ ఊరికి వెళ్లాలా?' అనుకుంటూ శ్రావ్య వెళ్లి తలుపు తీసింది. ఎదురుగా అతను. శ్రావ్యకు సిగ్గుగా అనిపించింది.

"లోపలకు రండి" అంటూ ప్రక్కకి తప్పుకుంది.అతను వచ్చి అక్కడున్న సోఫాలో కూర్చున్నాడు. శ్రావ్య అతనికెదురుగా నిలబడింది.

"మీరూ కూర్చోండి" అన్నాడతను.

శ్రావ్య మెల్లగా వెళ్లి అతనికి ఎదురుగా కూర్చుంది. ఆ అమ్మాయి పొందిగ్గా కూర్చున్న తీరు అతనికి నచ్చింది.

"మమ్మీ, డాడీ ఎక్కడికి వెళ్లారు?" అడిగాడతను.

"బంధువులు చనిపోతే చూసి రావడానికి ఏలూరు వెళ్లారు. సాయంత్రానికి వచ్చేస్తారు" చెప్పింది శ్రావ్య.

కొద్దిక్షణాలపాటు ఇద్దరి మధ్యనా మాటలు లేవు.

"కాఫీ తెస్తాను" అంటూ పైకి లేచింది శ్రావ్య. అతను అభ్యంతరం చెప్పలేదు. శ్రావ్య కిచెన్‌లోకి వెళ్లి ఫ్లాస్క్‌లోని కాఫీ కప్పులోకి ఒంపింది. కాఫీ కప్, సాసర్ ట్రేలో తెచ్చి అందించింది.

"మీరూ తెచ్చుకుంటే బాగుండేది" అన్నాడతను.

"మీరొచ్చేముందే తాగాను" చెప్పింది శ్రావ్య.

"అలా అయితే నేనూ ఇప్పుడే త్రాగాను. ఒక పని చేద్దాం. ఫిఫ్టీ...ఫిఫ్టీ" అతను కప్పులోని కాఫీ సగం సాసర్‌లో ఒంపి ఆమెకు కప్పు అందించాడు. అతను ఆఫర్ చేసిన తీరుకు శ్రావ్య కాదనలేకపోయింది. అతనితో కాఫీ సగం సగం పంచుకుని త్రాగడం శ్రావ్యకు నచ్చింది.

అతను కాఫీ త్రాగి సాసర్ టీపాయ్ మీద పెడుతూ "పెళ్లి చూపులు ముగిసాయికదా. మీనుంచి సమాధానం లేదు. తెలుసుకోవాలని వచ్చాను" వచ్చిన పని సూటిగా చెప్పాడతను.

"నా అభిప్రాయం డాడీకి చెప్పాను. మీకు చెప్పలేదా?"

"చదువుకోవాలని చెప్పారట. పెళ్లయిన తరువాత చదువుకోండి. మాకు ఎటువంటి అభ్యంతరంలేదు"

"మీ నుంచి ఓకే. కానీ పెళ్లి తరువాత నేను చదవలేను" చెప్పింది .

"అయితే ఒక పని చేద్దాం. ముందు ఎంగేజ్‌మెంట్ చేసుకుందాం. మీ చదువు అయ్యాక పెళ్లి చేసుకుందాం"

"నిజం చెప్పేయనా?" అమాయకంగా అడిగింది శ్రావ్య.


"చెప్పండి. అందుకే నేను వచ్చింది" చెప్పాడతను.

"నాకు పెళ్లంటే కొన్ని భయాలున్నాయి. అందుకే పెళ్లి చేసుకోవడం ఇష్టంలేదు" చెప్పింది శ్రావ్య.

"ఏమిటా భయాలు?" ఆరా తీసాడతను.

శ్రావ్య తన ఫ్రెండ్స్ గురించి చెప్పింది. ఆమె చెప్పింది సావధానంగా విన్నాడతను.


"అలాంటి భయాలకు మా ఇంట్లో ఆస్కారంలేదు. ఎందుకంటే



## తాజ్‌మహల్‌కి గాజు కవరింగ్

మధురా రిఫైనరీ వల్ల వచ్చిన వాతావరణ కాలుష్యంవల్ల ఒకప్పటి తెల్లని తాజ్‌మహల్ కావిరంగు తేలిన విషయం, దానిని రకరకాల రసాయినాలతో క్లీన్ చేసి పురాతన శోభ తీసుకురావాలని అనేక ప్రయత్నాలు చేస్తున్న సంగతి తెలిసిందే. టూరిస్టులు మాటిమాటికీ చేతులు వేయడంవల్ల మురికి అంటుకుని వాటి గోడల్ని, సమాధుల్ని పరిశుభ్రంగా తెల్లగా ఉంచడం కష్టతరం అవుతున్న నేపథ్యంలో తాజ్‌మహల్ యావత్తు మార్బుల్‌ని గాజుతో కవరింగ్ చేయాలని పురావస్తు శాస్త్రజ్ఞులు తలపెట్టారు. ఈ ప్రాజెక్టుని అమలు జరపడానికి ప్రభుత్వం అనుమతించడం కూడా జరిగింది.

-తటవర్తి




అమ్మానాన్నలకు ఆడపిల్లలు లేరు. నేను ఒక్కడినే కొడుకును. అందుకే వాళ్లు కాబోయే కోడలిలో కూతుర్ని చూసుకోవాలని కలలు కంటున్నారు. పిచ్చి వేషాలు వేస్తే ముందు నన్ను బయటకు పంపిస్తారు'' జోక్ వేసాడతను.కోడల్ని కూతురిగా చూసుకోవాలనుకుంటున్న మాట శ్రావ్య హృదయానికి హత్తుకుంది. శ్రావ్య మౌనం వహించడం గమనించిన అతను "ఈ పెళ్లి విషయంలో బలవంతం ఏమీలేదు. మీకు ఎలా తోస్తే అలా చేయండి'' అన్నాడు. ఆ తరువాత అతను తన చదువు గురించి, స్పోర్ట్స్‌లో ఉన్న ఆసక్తి గురించి, తనకు వచ్చిన బహుమతుల గురించి, పుస్తకాలపట్ల తన అభిరుచి గురించి, తన అభిమాన రచయితలు, పిల్లలపట్ల తనకున్న ప్రేమ గురించి... ఇలా చాలాసేపు మాట్లాడాడు. ఆ మాటలన్నీ శ్రావ్య చాలా శ్రద్ధగా వింది. అతను తాను మాట్లాడడమే కాకుండా శ్రావ్య చేత కూడా మాట్లాడిస్తూ ఆ అమ్మాయి అభిరుచుల్ని తెలుసుకున్నాడు. సమయం పన్నెండు దాటింది. అది గమనించిన శ్రావ్య "మాటల్లో పడి టైం తెలియలేదు. ఉండండి వంట చేస్తాను. భోజనం చేసి వెళ్లదురుగాని'' అన్నది.



## చాలాకాలం తర్వాత...

టాప్ హీరోలందరితోనూ తెలుగులో నటించిన శ్రియ హీరోయిన్‌గా నటించిన తెలుగు సినిమా వచ్చి దాదాపు ఐదేళ్లు కావొస్తోంది. 2005లో రవితేజ హీరోగా నటించిన 'భగీరథ' సినిమా శ్రియ హీరోయిన్‌గా ఆఖరి తెలుగు సినిమా. ఆ తర్వాత ఆమె ఒకటి రెండు ఐటమ్ సాంగ్స్ చేసిందిగానీ హీరోయిన్‌గా మళ్లీ ఇప్పుడు రవితేజతోనే నటించడానికి ఎంపికైంది. 'డాన్ శీను'లో నటించాల్సిన త్రిషకి కాల్షీట్ల సమస్య రావడంతో శ్రియని ఎంపికచేసారట నిర్మాతలు.




"మహద్భాగ్యం'' అన్నాడతను.

శ్రావ్య కిచెన్ రూమ్‌లోకి వెళ్లింది. పది నిముషాల తరువాత అతను అక్కడికి వచ్చాడు. అది శ్రావ్యకు నచ్చలేదు. ఆకతాయిగా ప్రవర్తించడు కదా? అనుకుంది.

"ఏమైనా సాయం చేయనా?'' అడిగాడతను.

"వద్దు'' అంది శ్రావ్య.

"నాకిది అలవాటే. అమ్మ వంట చేస్తుంటే నేను సాయం చేస్తుంటాను'' అని ఆమె నుంచి ఉల్లిపాయలు అందుకుని తను తురమసాగాడు. అది శ్రావ్యకు నచ్చింది. ఆమె తండ్రి కూడా అలాగే సాయం చేస్తుంటాడు. అరగంటలో వంట పూర్తయింది. అతనేం అసభ్యంగా ప్రవర్తించలేదు సరికదా తన హుందాతనంతో శ్రావ్య మనసులో స్థానం సంపాదించాడు. వంట పాత్రలను టేబుల్ దగ్గరకు చేర్చడంలో అతను సహాయపడ్డాడు. భోజనం రుచి చూసి "మార్వలెస్'' అన్నాడు.

"మరీ పొగడకండి'' అంది శ్రావ్య సిగ్గుపడుతూ.

"నిజం చెబుతున్నాను. మా అమ్మ చేతి వంట కంటే కూడా బాగుంది'' అన్నాడు.

భోజనాంతరం అతను బయలుదేరబోతుంటే "కొంచెంసేపు కబుర్లు చెప్పండి'' అంది శ్రావ్య.

అతను చిన్నగా నవ్వుతూ "మీరు మంచి శ్రోత. తక్కువ మాట్లాడతారు. నేను ఒట్టి వాగుడుకాయను'' అన్నాడు.

"ఏంకాదు. మంచి విషయాలు మాట్లాడతారు'' అంది శ్రావ్య.

"మీ అభినందనకు కృతజ్ఞుడను'' అన్నాడతను.

కొంచెంసేపు ఇద్దరూ చెస్ ఆడారు. రెండుసార్లూ శ్రావ్యే గెలిచింది.

"చెస్ మీరు బాగా ఆడతారు. అంటే మీరు మంచి మేధావి'' అన్నాడు ఆమెను అభినందిస్తూ.

శ్రావ్యకు కొంచెం గర్వంగా అనిపించింది. అతను నాలుగింటికి బయలుదేరాడు. వెళ్లేముందు "మా సంబంధం మీకు నచ్చి ఉండకపోవచ్చు. మనం భార్యాభర్తలం కాకపోవచ్చు. కానీ మంచి స్నేహితులం కావచ్చు. ఒకసారి మా ఇంటికి రండి. అమ్మానాన్న సంతోషిస్తారు'' అంటూ స్నేహపూర్వకంగా చేయి చాపాడు. శ్రావ్య మనస్ఫూర్తిగా అతనితో చేయి కలిపి 'బై' చెప్పింది అతను వెళ్లిపోయాడు. అతను వెళ్లాక అతని గురించే చాలాసేపు ఆలోచించింది శ్రావ్య. 'అతని చూపులు కొరుక్కుతినేట్టు లేవు. చల్లటి వెన్నెల్లా ఉన్నాయి. అతని మాటలు పడగొట్టేట్లు లేవు. చల్లటి శీతల పవనంలా ఉన్నాయి. అతని మనసులో మర్మం లేదు. అద్దంలా ఉంది' అనుకుంది శ్రావ్య.

***

ఆ సాయంత్రానికి శ్రావ్య తల్లిదండ్రులు ఊరు నుండి వచ్చారు.

"డాడీ! మీరు ఊరికి వెళ్లారు. అతనొచ్చాడు'' అని చెప్పింది శ్రావ్య.

"ఏం మాట్లాడాడు? నీవేం అన్నావు?'' ఉద్విగ్నంగా అడిగాడు రామచంద్రరావు.

"చాలా విషయాలు మాట్లాడాడు. అతను నాకు బాగా నచ్చాడు. ఈ పెళ్లికి నేను మనస్ఫూర్తిగా ఒప్పుకుంటున్నాను'' అంది శ్రావ్య.

'కంగ్రాచ్యులేషన్స్'' శ్రావ్య తల్లిదండ్రులు కూతుర్ని అపురూపంగా దగ్గరకు తీసుకున్నారు.

★